పార్టీని వీడిన వారికి ఓటుతో బుద్ధి చెప్పాలి



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఆదివారం టీపీసీసీ కార్యదర్శి కోట్ల శ్రీనివాస్, యాఖుత్‌పురా నియోజకవర్గం యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి లడ్డు పటేల్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. - సైదాబాద్, ఆంధ్రజ్యోతి

సీఎం సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన ఆలయ చైర్మన్



సీఎం సమక్షంలో రఘుమారెడ్డికి కాంగ్రెస్ కండువా కప్పుతున్న వేం నరేందర్‌రెడ్డి

చంపాపేట, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్ హనుమాన్ ఆలయ చైర్మన్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు నల్ల రఘుమారెడ్డి శనివారం రాత్రి సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి రఘుమారెడ్డికి పార్టీ కండువా కప్పారు. అంతకు ముందు రఘుమారెడ్డి సీఎంను మర్యాదపూర్వకంగా కలిసి ఆయనను ఘనంగా సన్మానించారు. రఘుమారెడ్డితో పాటు ఆలయ మాజీ ధర్మకర్త సామ రంగారెడ్డి, నాయకులు రవీందర్‌రెడ్డి, విక్రమ్, విజేందర్ ఉన్నారు.



ఎమ్మెల్యే రంగారెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న బీఆర్ఎస్ కౌన్సిలర్లు

కాంగ్రెస్‌లోకి బీఆర్ఎస్ కౌన్సిలర్లు

హయత్‌నగర్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): తుర్కయంజాల్ మున్సిపాలిటీకి చెందిన కౌన్సిలర్లు మర్రి మాధవి, పుల్లగుర్రం కీర్తన, హయత్‌నగర్ మండల మాజీ జడ్పీటీసీ కృష్ణగౌడ్‌లు ఆదివారం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, రాష్ట్ర రోడ్డు డవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఎమ్మెల్యే వారికి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవినీతి బీఆర్ఎస్‌కి రోజులు దగ్గర పడ్డాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంతోనే రాష్ట్రం అభివృద్ధి సాధిస్తుందన్నారు. కార్యక్రమంలో తుర్కయంజాల్ మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షురాలు, కౌన్సిలర్ కొత్తకుర్మ మంగమ్మ శివకుమార్, కౌన్సిలర్లు నారని కవిత శేఖర్‌గౌడ్, కుంట ఉదయశ్రీ గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

బ్యాట్ పట్టిన మేయర్..!



క్రికెట్ ఆడుతున్న మేయర్ పారిజాతారెడ్డి


సరూర్‌నగర్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని నాదర్‌గుల్‌లో స్థానిక యువజన సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నాదర్‌గుల్ ప్రీమియర్ లీగ్(ఎన్‌పీఎల్) క్రికెట్ టోర్నమెంట్‌ను ఆదివారం బడంగ్‌పేట్ మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వివిధ జట్లకు చెందిన ఆటగాళ్లను పరిచయం చేసుకుని టాస్ వేసిన మేయర్.. అనంతరం బ్యాట్ పట్టి బౌలర్లు వేసిన బంతులను ఎదుర్కొని కాసేపు సందడి చేశారు. ఈ సందర్భంగా పారిజాతారెడ్డి మాట్లాడుతూ క్రీడల్లో గెలుపోటములు సహజమని, ఓటమితో కుంగిపోకుండా మరింత పట్టుదలతో గెలుపు కోసం ప్రయత్నించాలని సూచించారు. యువతలో మానసికోల్లాసం, శారీరక దృఢత్వానికి క్రీడలు దోహదం చేస్తాయని ఆమె అన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రొటోకాల్ సెల్ కార్యదర్శి బంగారు బాబు, యెల్చల పురుషోత్తంరెడ్డి, సుభాన్‌యాదవ్, సుభాష్‌రెడ్డి, విజయ్, హరి, అనిల్, రజని, హరీశ్ పాల్గొన్నారు.



అవగాహన ర్యాలీలో ఎమ్మెల్సీ దయానంద్, డాక్టర్ స్వప్నకుమారి

క్షయ వ్యాధి నిర్మూలనకు కృషి చేయాలి : ఎమ్మెల్సీ

దిల్‌సుఖ్‌నగర్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): క్షయ వ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ పిలుపునిచ్చారు. ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని నవభారతి నిర్మాణం ఫౌండేషన్, స్వప్న ఆస్పత్రి స్కూల్ ఆఫ్ నర్సింగ్ సంయుక్త ఆధ్వర్యంలో చైతన్యపురిలో నిర్వహించిన అవగాహన శిబిరంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వప్న ఆస్పత్రి నుంచి నర్సింగ్ విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రముఖ గైనకాలజిస్ట్, డాక్టర్ స్వప్నకుమారి మాట్లాడుతూ ప్రతి రోజు సుమారు 4100 మంది క్షయవ్యాధి మూలంగా తమ జీవితాలను కోల్పోతున్నారని ఆవేద వ్యక్తం చేశారు. కార్యక్రమంలో తెలంగాణ మేధావుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజ్‌నారాయణ, స్వప్న కాలేజ్ ఆఫ్ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ శతాబ్ది వర్మ, బీఆర్ఎస్ నేత రిషి, శిరీష, ఉదయ రంజని, స్మిత, సౌమ్య పాల్గొన్నారు.



నీటి సంరక్షణపై అవగాహన కల్పిస్తున్న జలమండలి అధికారులు

నీటి సంరక్షణపై అవగాహన

మన్సూరాబాద్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ జల దినోత్సవాన్ని పురస్కరించుకొని సీడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో జలమండలి సహకారంతో నీటి సంరక్షణ, వినియోగంపై అవగాహన కార్యక్రమాన్ని ఆదివారం నాగోల్ డివిజన్ చాణిక్యపురి కాలనీలో నిర్వహించారు. జలమండలి డైరెక్టర్ శ్రీధర్‌బాబు మాట్లాడుతూ నీటిని వృథా చేయకుండా ప్రతిఒక్కరూ జాగ్రత్తలు పాటించాలన్నారు. వేసవిలో నీటి కొరత ఏర్పడకుండా తగిన చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఇంకుడు గుంతల స్పెషలాఫీసర్ జల సత్యనారాయణ, మేనేజర్ అర్చన, సీడ్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి నాగబ్రహ్మచారి, శ్రీధర్, లోకేష్ పాల్గొన్నారు.



పిచ్చుక గూళ్లు, మూకుళ్లు, నీటి తొట్లు అందజేస్తున్న శ్రీనివాస్, విజయ్

పిచ్చుక గూళ్లు, మూకుళ్లు, నీటి తొట్లు అందజేత

మన్సూరాబాద్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ పిచ్చుకల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం జాగృతి అభ్యుదయ సంఘం, 'వ్యూ' స్కూల్, సామాజిక కార్యకర్త గడ్డె విజయ్ సంయుక్త ఆధ్వర్యంలో బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ గాయత్రినగర్ బ్యాంక్ కాలనీలో స్థానికులకు పిచ్చుక గూళ్లు, వాటికి నీటి కోసం మూకుళ్లు, వీధి జీవాల దాహం తీర్చేందుకు నీటి తొట్లు, ఔషధ మొక్క, బట్ట సంచులను పంపిణీ చేశారు. జాగృతి సంఘం అధ్యక్షుడు బావన శ్రీనివాస్ మాట్లాడుతూ మానవ మనుగడ ఇతర జీవులతో ముడిపడి ఉన్నదని, ప్రత్యేకించి పిచ్చుకలు చీడ పురుగులను తినేసి మనకు పంటలు అందించేందుకు ఎంతో ఉపయోగపడుతాయన్నారు. పక్షుల కోసం గుక్కెడు నీళ్లు, గుప్పెడు గింజలు చాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జ్యోతి, బద్రారెడ్డి, కామేశ్, గౌరిశెట్టి మనోజ్‌కుమార్, ప్రసాద్, రాంబాబు, శ్రీశైలం, శశి పాల్గొన్నారు.

- గతంలో గడ్డం, కొండా గెలిచింది కారు గుర్తుపైనే
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి



విజయ సంకేతం చూపుతున్న సబితారెడ్డి, వాణీదేవి తదితరులు

సరూర్‌నగర్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): గతంలో కారు గుర్తుపై పోటీ చేసి గెలిచిన అభ్యర్థులు నేడు ఇతర పార్టీల నుంచి పోటీ చేస్తున్నారని, కష్ట కాలంలో సొంత పార్టీని వీడిన అలాంటి నేతలకు ఓటుతో బుద్ధి చెప్పాల్సిన అవసరం ఉన్నదని మాజీమంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి అన్నారు. చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గం పరిధిలోని మహేశ్వరం నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశం ఆదివారం మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని జిల్లెలగూడలో గల ఎస్‌వైఆర్ కన్వెన్షన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా సబితారెడ్డి మాట్లాడుతూ సిట్టింగ్ ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి, మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డిలు ఎంపీలుగా పార్లమెంటులో అడుగు పెట్టే అవకాశం కల్పించింది బీఆర్ఎస్సేనని గుర్తుంచుకోవాలని అన్నారు. అందలమెక్కించిన పార్టీని వదిలి వెళ్లిన వారిని మళ్లీ ఆదరించొద్దని సూచించారు. ప్రస్తుతం బీఆర్ఎస్ తరఫున పోటీ చేస్తున్న కాసాని జ్ఞానేశ్వర్ రంగారెడ్డి జడ్పీ మాజీ చైర్ పర్సన్‌గా అందరికీ సుపరిచితుడేనని, బీసీల ఐక్యత కోసం, సంక్షేమం కోసం పరితపించే ఆయనను భారీ మెజారిటీతో గెలిపించుకోవాలని పార్టీ శ్రేణులకు సూచించారు. చేవెళ్ల అభ్యర్థి జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ తనను ఎంపీగా గెలిపిస్తే చేవెళ్ల సమగ్రాభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు. సమావేశంలో పాల్గొన్న రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, ఎమ్మెల్సీలు సురభి వాణీదేవి, యెగ్గె మల్లేశం, దయానంద్‌గుప్తా మాట్లాడుతూ పార్లమెంటులో బడుగు, బలహీనవర్గాల గొంతు వినిపించే అవకాశం కాసానికి కల్పించాలని, ఈ దృష్ట్యా ఆయనను మంచి మెజారిటీతో గెలిపించుకోవాల్సిన అవసరం ఉన్నదని అన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ కృష్ణారెడ్డి, మీర్‌పేట్ మేయర్ దుర్గాదీప్‌లాల్, డిప్యూటీ మేయర్ విక్రమ్‌రెడ్డి, బీఆర్ఎస్ నియోజకవర్గం అధ్యక్షుడు అరవింద్‌శర్మ, మీర్‌పేట్ అధ్యక్షుడు కామేశ్‌రెడ్డి, బడంగ్‌పేట్ అధ్యక్షుడు రాంరెడ్డి, నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణుల అభ్యున్నతికి సహకరిస్తాం

- బ్రాహ్మణ సోదరుల ఆత్మీయ సమ్మేళనంలో వక్తలు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ సురభివాణి

కొత్తపేట, మార్చి 24(ఆంధ్రజ్యోతి): తెలంగాణ బ్రాహ్మణుల అభ్యున్నతికి అన్నివిధాలా సహకరిస్తామని బ్రాహ్మణ సోదరుల ఆత్మీయ సమ్మేళనంలో వక్తలు వెల్లడించారు. కొత్తపేట శ్రీనివాస ఫంక్షన్ హాల్‌లో ఆదివారం బ్రాహ్మణుల ఆత్మీయ సమ్మేళనం, అంతర్జాతీయ మహిళా దినోత్సవాలను ఘనంగా నిర్వహించారు. తెలంగాణ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య(టీబీఎస్ఎస్ఎస్) రాష్ట్ర అధ్యక్షుడు వెన్నంపల్లి జగన్మోహన్ శర్మ, హైదరాబాద్ - రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మునిపల్లె శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రముఖులకు సత్కార వేడుకలు ఘనంగా నిర్వహించారు. మాజీ ప్రధాని పీవీ నర్సింహారావుకు భారత రత్న పురస్కారం ప్రకటించడం తమ కుటుంబ సభ్యులకు ఎంతగానో ఆనందాన్నిచ్చిందని ఎమ్మెల్సీ సురభి వాణి తెలిపారు. మాజీ కేంద్ర మంత్రి సముద్రాల వేణుగోపాలచారి, మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు, బసవరాజు శ్రీనివాస్, వైష్ణవీ ప్రసాద్ మాట్లాడుతూ బ్రాహ్మణులు అన్ని రంగాల్లో ఎదగాలని, వారి సంక్షేమానికి తమ వంతు కృషి చేస్తామని పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో డా.సూరి శ్రీమతి, అనంతలక్ష్మి, లక్ష్మి మాందాత, నిష్పాని రుక్మిణీలను సత్కరించారు. ఈ సమ్మేళనంలో ప్రతినిధులు బోరుపట్ల హనుమంతాచారి, వక్కలంక శ్రీనివాసరావు, కల్పవల్లి, సూరి జయతులసి పాల్గొన్నారు.

ఘనంగా విజయచాముండి హోమం

- హాజరైన మేయర్ విజయలక్ష్మి, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి



బ్రహ్మోత్సవాల్లో మేయర్ విజయలక్ష్మి, కార్పొరేటర్ మధుసూదన్‌రెడ్డి తదితరులు

చంపాపేట, మార్చి 24(ఆంధ్రజ్యోతి): హస్తినాపురం డివిజన్ బైరామల్‌గూడ డిఫెన్స్‌కాలనీలోని హరిహర క్షేత్ర అయ్యప్పస్వామి ఆలయంలో 13వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఐదోరోజు ఆదివారం భక్తిశ్రద్ధలతో ముగిశాయి. ఈ బ్రహ్మోత్సవాలలో ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, ఆలయ వ్యవస్థాపకులు, కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి, చైర్మన్ వంగా చంద్రారెడ్డి పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో ఉదయం గణపతిపూజ, మంటపారాధన పూజలు, విజయచాముండి(చండీ)హోమం, మూల మంత్ర హవనములు, పూర్ణాహుతి, నీరాజన మంత్ర పుష్పములు, తీర్థప్రసాద వితరణ కార్యక్రమం ఘనంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. జగద్గురువులు హంపీ విరూపాక్ష విద్యారణ్య భారతి మహాసంస్థాన పరిపాలిత వారి అనుగ్రహంతో చాముండేశ్వరి గురు దత్తపీటం వ్యవస్థాపకులు కొడకండ్ల శ్రీరామశరన్‌శర్మ గురూజీ ఆచార్య బ్రహ్మత్వంలో రమణ గురుస్వామి, రాఘవేందర్‌రావు దేశ్‌పాండే, ఆలయ ప్రధాన అర్చకులు రంజిత్ తంత్రి పర్యవేక్షణలో పూజా కార్యక్రమాలు అత్యంత వైభవంగా కొనసాగాయి. కార్యక్రమంలో ఆలయ ప్రధాన కార్యదర్శి గడ్డం మంగారెడ్డి, ఆలయ డైరెక్టర్లు సద్ది సందీప్‌రెడ్డి, కొక్కొండ సూర్యప్రకాష్‌గుప్తా, లంకాల రమేష్‌రెడ్డి, విజ్ఞేశ్వర్‌రెడ్డి, మిరియాల అంజయ్యగుప్తా, లింగాల దశరథ్‌గౌడ్, హరీష్‌రెడ్డి, నిర్మలేష్‌గుప్తా, మణిపాల్‌రెడ్డి, హరిగుప్తా, మల్లికార్జున్‌గుప్తా, కేశవరెడ్డి, భిక్షపతిగౌడ్ పాల్గొన్నారు.

నేటి నుంచి సనాతన వేదాంత జ్ఞాన సభలు

- ఏర్పాట్లను పరిశీలించిన స్వామీజీలు, నిర్వాహకులు



వేదాంత సభల ఏర్పాట్లను పరిశీలిస్తున్న పరిపూర్ణానందగిరి, అసంగానందగిరి స్వామి

సరూర్‌నగర్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని బాలాపూర్‌లో గల ఎస్‌పీఆర్ లక్ష్మీ గార్డెన్స్‌లో సోమవారం నుంచి బుధవారం వరకు మూడు రోజుల పాటు హైదరాబాద్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ, సద్గురు మళయాళస్వామి భక్త బృందం ఆధ్వర్యంలో 'శ్రీసనాతన వేదాంత జ్ఞాన సభలు' నిర్వహిస్తున్నట్లు వ్యాసాశ్రమ పీఠాధిపతి పరిపూర్ణానంద గిరి స్వామి, అసంగానందగిరిస్వామి తెలిపారు. సదరు సభలకు సంబంధించిన ఏర్పాట్లను ఆదివారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ సభలకు వివిధ ప్రాంతాల నుంచి పలువురు పీఠాధిపతులు, స్వామీజీలు, మాతాజీలు హాజరవనున్నారని, వారంతా భక్తులకు సందర్భోచిత ప్రవచనాలు అందిస్తారని తెలిపారు. గతంలో వివిధ రాష్ట్రాల్లో ఈ సభలను నిర్వహించామని, తెలంగాణ రాష్ట్రం సిద్ధించిన తర్వాత తొలిసారిగా ఈసారి హైదరాబాద్‌లో నిర్వహిస్తున్నామని వారు పేర్కొన్నారు. జ్ఞాన సభలకు విచ్చేసే అతిథులు, భక్తులకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేస్తున్నామని, ప్రతి ఒక్కరూ ఈ మహత్తర కార్యక్రమాల్లో పాల్గొని స్వామీజీల ప్రవచనాలు ఆలకించి ఆధ్యాత్మికానందాన్ని పొందాలని వారు సూచించారు. కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు ఎస్.లక్ష్మణ్ గుప్తా, కన్వీనర్ కె.పాండుగుప్తా, దయాకర్‌గుప్తా, వెంకటేశ్, ప్రకాశ్‌గుప్తా, పురుషోత్తంచారి పాల్గొన్నారు.

టీచర్లకు 'టెట్' టెన్షన్

(5వ పేజీ తరువాయి)

ఇందులో దాదాపు 25 శాతం మంది రిటైర్‌మెంట్‌కు దగ్గరలో ఉన్నారు.

ఎస్‌జీటీలకు టెట్-1 తప్పనిసరి..

స్కూల్ అసిస్టెంట్ ప్రమోషన్ కోసం ఎదురుచూస్తున్న సెకండరీ ఎడ్యుకేషన్ టీచర్(ఎస్‌జీటీ)లు తప్పనిసరిగా టెట్-1ను రాయాల్సిన పరిస్థితి నెలకొంది. ఇందులో అర్హత సాధిస్తేనే రానున్న రోజుల్లో వారికి ఎస్‌ఏ పదోన్నతి దక్కనుంది. అలాగే, ఇప్పటికే స్కూల్ అసిస్టెంట్ కేటగిరీలో ఉద్యోగం పొందిన వారు సైతం టెట్-2ను రాయాల్సి ఉంది. భవిష్యత్ లభించే హెచ్‌ఎం, గెజిటెడ్ హెచ్‌ఎం లాంటి పదోన్నతులకు కూడా టెట్-1 ప్రామాణికంగా తీసుకునే పరిస్థితి ఉండడంతో వారు కూడా ఇందులో పాస్ కావాల్సి ఉంది. కాగా, ఎన్‌సీటీఈ తాజా నిబంధనలతో ఎస్‌జీటీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 2010 నుంచి 2017 వరకు నిర్వహించిన టీచర్ రిక్రూట్‌మెంట్ టెస్ట్(టీఆర్‌టీ)లో ఉద్యోగం పొందిన ఉపాధ్యాయులు టెట్‌లో అర్హత సాధించేందుకు ప్రయత్నిస్తుండగా.. 1995 తర్వాత నుంచి ఉద్యోగంలో చేరిన వారు ఒత్తిడికి లోనవుతున్నారు. ఎందుకంటే వారందరూ దాదాపు రిటైర్‌మెంట్‌కు దగ్గరగా ఉండడంతో పరీక్షను ఎదుర్కోవడం కష్టం.

ఎన్నికలకు ముందు కొందరికి న్యాయం..

ఉపాధ్యాయుల పదోన్నతులపై గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఏళ్ల తరబడి ఊరిస్తూ వచ్చింది. ఇదిగో.. అదిగో.. అంటూ సంవత్సరాలుగా కాలయాపన చేసింది. దీంతో చాలామంది ప్రమోషన్లు పొందకుండానే రిటైర్‌మెంట్ అయ్యారు. అసెంబ్లీ ఎన్నికలు సమీపించిన తరుణంలో గతేడాది సెప్టెంబర్, అక్టోబర్‌లో కొంతమందికి హడావుడిగా ప్రమోషన్లు కల్పించింది. తర్వాత షెడ్యూల్ రావడంతో ప్రక్రియకు బ్రేక్ పడింది. కాగా, అప్పుడు ఎస్‌జీటీలు స్కూల్ అసిస్టెంట్ కేడర్‌కు వెళ్లగా.. స్కూల్ అసిస్టెంట్లు.. హెచ్‌ఎంలుగా, గెజిటెడ్ హెచ్‌ఎంలుగా పదోన్నతులు పొందారు. అయితే, వారందరూ టెట్ నిబంధన లేకుండానే ప్రమోషన్ తీసుకున్నారని, ఇప్పుడు తమకు తప్పనిసరి చేయడం ఎంతవరకు న్యాయమని పలువురు ఎస్‌జీటీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యా కార్యక్రమాలతోపాటు అభ్యసన శిక్షణలకు హాజరవుతూ విద్యార్థులకు మెరుగైన బోధనలు అందిస్తున్నామని, ఇలాంటి పరిస్థితుల్లో తమకు టెట్‌ను అర్హతగా చూపించడం తగదని వాపోతున్నారు.

డీఈడీ, బీఈడీ పూర్తిచేసిన అభ్యర్థులకు టెట్ నిర్వహించి, టీఆర్‌టీ ద్వారా ఉద్యోగాలు అందించడం శుభ పరిణామమని, తమకు టెట్‌ను ప్రతిబంధకంగా చూపి ప్రమోషన్లు అడ్డుకోవద్దని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

కోచింగ్ తీసుకునేందుకు పరుగులు..

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన టెట్ నోటిఫికేషన్ నేపథ్యంలో డీఈడీ, బీఈడీ పూర్తిచేసిన అభ్యర్థులతోపాటు పలువురు ఎస్‌జీటీలు, స్కూల్ అసిస్టెంట్లు సైతం కోచింగ్ తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా కొందరు ఆఫ్‌లైన్‌లో సెంటర్లకు వెళ్తుండగా, మరి కొందరు ఆన్‌లైన్‌లో ఇంటి నుంచే శిక్షణ పొందుతున్నారు. భవిష్యత్ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ముందస్తుగా టెట్‌ను సాధిస్తే బాగుంటుందనే పట్టుదలతో ఉన్నారు. ఏదేమైనా ప్రభుత్వ ఉపాధ్యాయులకు టెట్ అర్హత పరేషాన్ చేస్తోందని చెప్పవచ్చు.

గోశాల నుంచి ఆవుల అపహరణ

- మత్తు ఎక్కువై ఒక ఆవు మృతి

మన్సూరాబాద్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): మన్సూరాబాద్ డివిజన్ జడ్జెస్ కాలనీలోని గోశాల నుంచి దుండగులు ఆవులను అపహరించారు. అంతేకాకుండా మిగతా వాటికి కూడా మత్తు ఇవ్వటంతో ఒక ఆవు మరణించింది. వనస్థలిపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వివరాల ప్రకారం.. మన్సూరాబాద్ జడ్జెస్ కాలనీలోని శివాలయం వద్ద కాలనీవాసులు కొన్నేళ్లుగా ఆరు గోవులతో గోశాల నిర్వహిస్తున్నారు. అయితే ఆదివారం తెల్లవారుజామున సదరు గోశాలలోని మూడు గోవులు కన్పించకపోవటంతో పాటు మిగతా మూడు కూడా మత్తులో కిందపడిపోయిన స్థితిలో స్థానికులకు కన్పించాయి. అయితే దుండగులు అన్ని గోవులను ఎత్తుకెళ్లటానికి వాహనంతో అక్కడికి వచ్చారని స్థానికులు భావిస్తున్నారు. వాటిని వాహనంలోకి ఎక్కించేందుకు మత్తు ఇచ్చి ఉంటారని, మూడింటిని వాహనంలో ఎక్కించి ఎత్తుకెళ్లారు. మిగతా వాటికి మత్తు ఎక్కువై కిందపడిపోవటంతో వాటిని వదిలేసి పారిపోయి ఉంటారని తెలుస్తుంది. స్థానికులు వెంటనే మూడు గోవులకు మత్తుకు విరుగుడు ఇంజక్షన్లు వేయించారు. అయినప్పటికీ ఒక గోవుకు మత్తు డోస్ ఎక్కువ కావటంతో నురగలు కక్కి చనిపోయింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మట్కా నిర్వాహకుల అరెస్ట్

సైదాబాద్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): గుట్టు చప్పుడు కాకుండా మట్కా నిర్వహిస్తున్న ఇంటిపై పోలీసులు దాడి చేసి ఇద్దరు నిర్వాహకులను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.97,490, ఐ ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. చావుని బాగేజహారాలో మహ్మద్ అబ్దుల్ ఖాదీర్(73), మహ్మద్ ఇమ్రాన్(32) గత కొంత కాలంగా మట్కా నిర్వహిస్తున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు మాదన్నపేట పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. వారి వద్ద నుంచి నగదు, ఐఫోన్ స్వాధీనం చేసుకున్నారు. మహారాష్ట్రకు చెందిన మినాజ్‌తో ఆన్‌లైన్ మట్కా నిర్వహిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మాదన్నపేట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

29 నుంచి మహ్మాయిదేవి రథోత్సవాలు



మహ్మాయిదేవి ఆలయం

అబ్దుల్లాపూర్‌మెట్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): నగర శివారు మహ్మాయిపురంలోని మహ్మాయిదేవి రథోత్సవాలు ఈనెల 29 నుంచి ప్రారంభం కానున్నాయి. శుక్రవారం ఉదయం అంకురార్పణ, ధ్వజారోహణంతో మొదలైన కార్యక్రమాలు మూడు రోజుల పాటు కొనసాగనున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. 30న ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం మధ్యాహ్నం 12.30 గంటలకు ఉమామహేశ్వర కల్యాణం, అనంతరం మహాపడి నైవేద్య నివేదన, 31న తెల్లవారు జామున రథోత్సవం, ఉదయం 11గంటలకు లక్ష్మీనర్సింహస్వామి కల్యాణం ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. కల్యాణ రథోత్సవాలకు హాజరయ్యే భక్తులకు రెండు రోజుల పాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. కల్యాణ, రథోత్సవాలకు శివారు గ్రామాల భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామి వారి తీర్థప్రసాదములు స్వీకరించాలని నిర్వాహకులు కోరారు.



కంఠమహేశ్వర ఆలయంలో పూజలు చేస్తున్న శ్రీనివాస్‌గుప్తా

ఘనంగా కంఠమహేశ్వర వన మైసమ్మ ఆలయ వార్షికోత్సవం

మన్సూరాబాద్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): బండ్లగూడలోని కంఠమహేశ్వర శివపంచాయతన వన మైసమ్మ ఆలయ ప్రథమ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. తెలంగాణ టూరిజం కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా ముఖ్యఅతిథిగా హాజరై పూజలు చేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు చెరుకు జంగయ్యగౌడ్, ఉపాధ్యక్షుడు మెట్టు శంకరయ్యగౌడ్, పాండుగౌడ్, లక్ష్మీబాయిగౌడ్, ప్రమీల గౌడ్, బాలయ్యగౌడ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీజేపీ మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ సతీమణి ఈటల జమున

బీజేపీ ఎంపీ అభ్యర్థి విజయానికి సహకరించాలి : ఈటల జమున

కొత్తపేట, మార్చి 24(ఆంధ్రజ్యోతి): మల్కాజిగిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ విజయానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన సతీమణి ఈటల జమున విజ్ఞప్తి చేశారు. కొత్తపేట డివిజన్ న్యూ మారుతీనగర్ కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం బీజేపీ మహిళా నాయకుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సమ్మేళనంలో ఈటల జమున ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మల్కాజిగిరి ఎంపీ స్థానాన్ని బీజేపీ అత్యధిక మెజారిటీతో కైవసం చేసుకునేలా పార్టీ కార్యకర్తలు, నాయకులు సైనికుల్లా పని చేయాలన్నారు. కార్పొరేటర్ పవన్‌కుమార్ మాట్లాడుతూ మల్కాజిగిరి బీజేపీ ఎంపీ అభ్యర్థికి కొత్తపేట డివిజన్ నుంచి అత్యధిక మెజారిటీ సాధించేలా కృషిచేయాలని సూచించారు. రంగారెడ్డి అర్బన్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు సామ రంగారెడ్డి, మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు, రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షురాలు నందికొండ గీతారెడ్డి పాల్గొన్నారు.



పద్మారెడ్డికి నియామక పత్రం అందజేస్తున్న డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి

రంగారెడ్డి డీసీసీ ప్రధాన కార్యదర్శిగా పద్మారెడ్డి

సరూర్‌నగర్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శిగా మీర్‌పేట్‌కు చెందిన ఎం.పద్మాసుధాకర్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి ఆదివారం ఆమెకు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో చేవెళ్ల నుంచి పోటీ చేస్తున్న పార్టీ అభ్యర్థి గెలుపు కోసం కృషి చేయాలని సూచించారు. తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తానని పద్మారెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు బొర్ర సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చంద్రపురికాలనీ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక



కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డితో చంద్రపురి కాలనీ నూతన కార్యవర్గం ప్రతినిధులు

మన్సూరాబాద్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): మన్సూరాబాద్ డివిజన్ చంద్రపురికాలనీ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం ఆదివారం ఎన్నికైనట్లు కాలనీ ప్రతినిధులు తెలిపారు. అధ్యక్షుడిగా ఎం.వెంకట్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా జీ.జ్ఞానేశ్వర్‌రావు, ప్రధాన కార్యదర్శిగా పీ.సోమిరెడ్డి, జాయింట్ సెక్రటరీగా ఎ.వి.ఆర్.ప్రసాద్, కోశాధికారిగా ఎం.మోహన్‌రావు ఎన్నికైనట్లు ప్రతినిధులు తెలిపారు. అనంతరం సదరు నూతన కమిటీ ప్రతినిధులు జీహెచ్ఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు.

పెయింటింగ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

సైదాబాద్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): ఇంట్రా స్కూల్ పెయింటింగ్ పోటీల్లో కరన్‌బాగ్‌లోని కేంబ్రిడ్జి స్కూల్ విద్యార్థులు ప్రతిభ చూపి నగరస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఆదివారం జెఎస్ డబ్ల్యూ పెయింట్స్, ది హిందూ యంగ్ వరల్డ్ సంస్థ ఆధ్వర్యంలో అమీర్‌పేటలో పోటీలు నిర్వహించారు. సబ్‌జూనియర్ విభాగంలో జీ.చైత్వనాయుడు, సీహెచ్. హారిక, జూనియర్స్‌లో నిక్షేత చక్కటి ప్రదర్శనతో నగర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరికి నిర్వాహకులు పతకాలు, ప్రశంసాపత్రాలు అందజేశారు.